సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
9705347494
నంబర్‌ను సంప్రదించండి

# పొంచి ఉన్న ముంపు ముప్పు

- ఆక్రమణల్లో గెడ్డలు
- జీవీఎంసీ 5, 6, 7, 8 వార్డుల్లో ఇదే పరిస్థితి
- హైవేను ఆనుకుని, మాస్టర్ ప్లాన్ రోడ్లలోనూ ఇలానే..
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- మహా నగరాల ముంపు చూసినా స్పందించని వైనం

మధురవాడ: ఆక్రమణకు కాదేదీ అనర్హం అన్నట్లు కొందరు అక్రమార్కులు చేపడుతున్న నిర్మాణాలు నగరాన్ని ముంపు ముంగిటకు నెట్టేస్తున్నాయి. ప్రమాదం అని తెలిసినా గెడ్డలు, కాల్వలు వంటి వాటిని కూడా ఆక్రమించేస్తున్నారు. విశాఖ రూరల్ పరిధి జీవీఎంసీ 5, 6, 7, 8 వార్డుల్లో పరిస్థితే ఇందుకు నిదర్శనం. ఇటు పీఎం పాలెం క్రికెట్ స్టేడియం మొదలుకుని బోయిపాలెం వరకు హైవేకు ఇరువైపులా.. నగరంపాలెం, రేవళ్ల పాలెం, మిథిలాపురి ఉడా కాలనీ మాస్టర్ ప్లాన్, కొమ్మాది మాస్టర్ ప్లాన్ రోడ్లకు ఇరువైపులా ఉన్న గెడ్డలనే కాదు ఇతర ప్రాంతాల్లో ఉన్న, మురుగు నీటి పారుదల గెడ్డలను కూడా వదలడం లేదు. దీంతో మురుగునీరు నిల్వ ఉండిపోవడంతో పాటు చిన్న వర్షం కురిసినా మురుగునీరు రోడ్డుపైకి, లోతట్టు ప్రాంతాల్లోకి వచ్చేస్తోంది. తరచూ ఇదే పరిస్థితి ఉన్నా, ఆక్రమణదారులపై చర్యలు చేపట్టకపోవడం, జీవీఎంసీ, రెవెన్యూ అధికారుల ఉదాసీన వైఖరి కనబరచడం పలు అనుమానాలకు తావిస్తోంది.


మారికవలస హైవేను ఆనుకుని ఓ పెట్రోల్ బంక్ వద్ద నామరూపాలు కూడా లేని భారీ గెడ్డ

- మారికవలస ఆర్‌జీకే కొత్త కాలనీ – పాత కాలనీ మధ్య హైవేను ఆనుకుని గెడ్డ వద్ద హైవే స్థలమని హెచ్చరిక బోర్డు పెట్టినా ఇక్కడ అపార్ట్‌మెంట్, వ్యాపార సంస్థలకు చెందిన వారు గెడ్డ మొత్తం కప్పేసి, చిన్నపాటి గొట్టాలు ఏర్పాటు చేశారు.


మారికవలస హైవే వద్ద పెద్ద గెడ్డను కప్పేసి ఏర్పాటు చేసిన చిన్న పైపులు

- మారికవలస వద్ద ఉన్న రెండు పెట్రోల్ బంక్‌ల ముందు నీరు పారుదలకు ఏమాత్రం అవకాశం లేకుండా గెడ్డలను కప్పేశారు. మెట్రో, గాయత్రీ కళాశాలల ముందు చిన్న చిన్న గొట్టాలు ఏర్పాటు చేసి ఇష్టానుసారంగా కప్పేశారు. హైవే ఇరువైపులా చాలా చోట్ల ఇదే పరిస్థితి.

- ఉడా కాలనీ రోడ్డును ఆనుకుని ఉన్న కాల్వలు కనిపించకుండా ఇరువైపులా ఆక్రమణలు జరిగిపోతున్నాయి.
- ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వద్ద, క్రికెట్ స్టేడియం పరిసర ప్రాంతాల నుంచి శివాలయం వరకు మురుగు, వర్షం నీరు పారే గెడ్డను ఆక్రమించి నిర్మాణాలు చేసేస్తున్నారు. ఇలా చెప్పుకొంటూ పోతే ఆక్రమణలు కోకొల్లలు.
- కొమ్మాది, శివశక్తి నగర్, పీఎం పాలెం, బక్కన్న పాలెం, సాయిప్రియ గార్డెన్ రోడ్డు వంటి చోట్ల కూడా ఇదే పరిస్థితి.


డంపింగ్‌యార్డు జంక్షన్ వద్ద భారీ అపార్ట్‌మెంట్ల యజమానులు ఆనవాళ్లే లేకుండా కప్పేసిన భారీ గెడ్డ

- నగరంపాలెం రోడ్డులో ఒక చోట కొందరు దుకాణదారులు గెడ్డ మొత్తం కప్పేసి దానిపై శ్లాబ్ వేసి చిన్నపాటి మ్యాన్‌హోల్స్ ఏర్పాటు చేశారు. దీంతో ఇక్కడ కాల్వల నిర్వహణ కష్టతరంగా మారుతోంది. మరికొందరు, క్రమక్రమంగా గెడ్డను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో సుమారు 15అడుగుల మేర ఉండాల్సిన గెడ్డ కొన్ని చోట్ల 2–3 అడుగులకే పరిమితమైంది.


నగరంపాలెం రోడ్డును ఆనుకుని ఉన్న గెడ్డలో అక్రమ నిర్మాణాలు


హైవేను ఆనుకుని మెట్రో వద్ద గెడ్డకు చిన్న గొట్టాలు వేయడంతో తరచూ మూసుకుపోతున్న మ్యాన్‌హోల్

## ఆక్రమణలు ఇలా..


పరదేశిపాలెం వద్ద కనీసం గొట్టాలు కూడా ఏర్పాటు చేయకుండా ఓ మార్బుల్ సంస్థ ఇష్టానుసారంగా కప్పేసిన గెడ్డ

- హైవేను ఆనుకుని పరదేశిపాలెం వద్ద ఉన్న ఓ మార్బుల్ షాపు, ఇటీవల నిర్మించిన అపార్ట్‌మెంట్ల ముందు, బొరవానిపాలెం డంపింగ్ యార్డు జంక్షన్ వద్ద నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్ల వద్ద కూడా గెడ్డ నామరూపాలు లేకుండా ఆక్రమించేశారు. దీంతో గెడ్డల ద్వారా పారాల్సిన నీరు రోడ్లపైకి వచ్చేస్తోంది.

## స్థానికుల్లో ఆందోళన

గెడ్డలు, కాల్వలు, చెరువుల ఆక్రమణల వల్లనే హైదరాబాదు, చెన్నై వంటి మహా నగరాలు ముంపునకు గురయ్యాయి. తాజాగా విజయవాడలో జల విలయతాండవం చేసింది. అటువంటి పరిస్థితి విశాఖలో తలెత్తకుండా అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## అధికారులు స్పందించాలి



గెడ్డలు, చెరువుల ఆక్రమణల వలన హైదరాబాదు, చెన్నై వంటి మహా నగరాల్లో సంభవించిన పరిణామాలు మనకు గుణపాఠం కావాలి. హైవేను ఆనుకుని మాత్రమే కాదు, మాస్టర్ ప్లాన్ రోడ్లు, అంతర్గత రహదారులను ఆనుకుని ఉన్నవాటిని కూడా నోరున్న, పలుకుబడి ఉన్న వారు ఆక్రమించేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలి.

– సియాద్రి కనకరాజు, మధురవాడ జై భీం అసోసియేషన్ అధ్యక్షుడు

## తక్షణ చర్యలు చేపడతాం



టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులతో చర్చించి గెడ్డలు, కాల్వల ఆక్రమణలపై వివరాలు తెలుసుకుంటాం. పూర్తిస్థాయిలో విచారణ చేసి ఆక్రమణలు ఉన్నచోట తొలగించేందుకు తక్షణ చర్యలు చేపడతాం. మాకు ప్రజా ప్రయోజనాలే ముఖ్యం.

– శైలజావల్లి, జోనల్ కమిషనర్, జీవీఎంసీ జోన్–2

## క్లుప్తంగా

### రేషన్ బియ్యం పట్టివేత


రేషన్ బియ్యం పట్టుకున్న డీటీ

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేటలో ఓ మహిళ అనధికారికంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని డీటీ కె. శ్రీనివాసరావు, వీఆర్వో అఖిల్ బుధవారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడ ఇంటింటికి వెళ్లి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి మిల్లుకు పంపించేందుకు ఓ మహిళ తన ఇంటి వద్ద 200 కేజీల బియ్యాన్ని నిల్వ చేసింది. స్థానికులు డీటీ కె.శ్రీనివాసరావుకు సమాచారం అందించడంతో, పరిశీలించి 200 కేజీల బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యాన్ని ఎవరైనా కొనుగోలు చేసినా, అమ్మినా చర్యలు తీసుకుంటామన్నారు.

### ప్రత్యేక అలంకరణలో సుత్తమ్మ తల్లి


చిప్పాడలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడలో గ్రామదేవత సుత్తమ్మ తల్లి బుధవారం ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలు, నిమ్మకాయల దండలు, గజమాలలతో అలంకరించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించారు.

### మినీ వ్యాన్ బోల్తా


గిడిజాల కూడలి వద్ద బోల్తా పడిన వ్యాన్

తగరపువలస: ఆనందపురం మండలం గిడిజాల కూడలి వద్ద బియ్యం లోడుతో వెళ్తున్న మినీ వ్యాన్ రహదారిపై గుంతను తప్పించబోయి బుధవారం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ప్రమాదం జరగలేదు. గాజువాక నుంచి పార్వతీపురానికి బియ్యం లోడుతో వెళ్తుండగా నీళ్లకుండీలు కూడలి నుంచి విజయనగరం మార్గంలో ఈ ప్రమాదం జరిగింది. నీళ్లకుండీల కూడలి–పద్మనాభం రహదారిపై అడుగడుగునా గుంతల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వెంటనే రహదారికి మరమ్మతులు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.

### 27 వాహనాలపై కేసుల నమోదు

మధురవాడ: మధురవాడ పరిసర ప్రాంతాల్లో నిబంధనలు ఉల్లంఘించిన 27 వాహనాలపై కేసులు నమోదు చేసినట్లు విశాఖ రవాణాశాఖ అధికారులు తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన వారిపై–2, హెల్మెట్ లేని వారిపై 13, ఫ్యాన్సీ నంబర్ ప్లేట్లకు సంబంధించి–2, బ్లాక్ ఫిల్మ్ కలిగిన వాహనం–1, ట్రిపుల్ రైడింగ్–1, సెల్ ఫోన్ డ్రైవింగ్–1, ఇన్సూరెన్స్ లేకుండా వాహనం నడుపుతున్న వారు–4, పర్మిట్ లేని వాహనం–1, ఫిట్‌నెస్ లేని వాహనాలు–2 మొత్తం 27 వాహనాలకు సంబంధించి కేసులు నమోదు చేశామన్నారు. తనిఖీల్లో ఎంవీఐ అధికారి ఐ.మాధవి, ఏఎంవీఐలు పాల్గొన్నారు.

### ఈ-పంట నమోదు తప్పనిసరి

పద్మనాభం: రైతులందరూ ఈ–పంట నమోదుతో పాటు ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.అప్పలస్వామి సూచించారు. కోరాడ, మద్ది, కృష్ణాపురం గ్రామాల్లో పర్యటించిన ఆయన ఈ–పంట నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈకేవైసీ చేయించుకున్నప్పుడే వ్యవసాయపరంగా ప్రభుత్వం అందించే రాయితీలు పొందవచ్చన్నారు. మద్దిలో ఎరువుల షాపును తనిఖీ చేశారు. గొడౌన్‌లో ఉన్న స్టాకు, స్టాకు రిజిస్టర్లను పోల్చి చూశారు. ఎరువులు అయిన వెంటనే ఇండెంట్ పెట్టాలని రైతు సేవా కేంద్రం సిబ్బందిని ఆదేశించారు. ఏవో ఎంవీఎస్ చలం పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
భీమిలి
✆ 9493185214

## డచ్ సమాధులను సందర్శించిన కలెక్టర్

భీమునిపట్నం: భీమిలిలోని చారిత్రక డచ్ సమాధులను కలెక్టర్ హరేందిర ప్రసాద్ బుధవారం సందర్శించారు. బీచ్ వద్దనున్న సమాధులను సందర్శించి, వాటి వివరాలను అధికారులనడిగి తెలుసుకున్నారు. సమీపంలోని లైట్ హౌస్‌ను సందర్శించారు.

**యూపీహెచ్‌సీ పరిశీలన**

చిన్నబజారు ప్రాంతంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, అక్కడి రోగులతో మాట్లాడారు. ఆరోగ్యకేంద్రంలో అందుతున్న వైద్య సదుపాయాల గురించి ఆరా తీశారు. మందులు ఏ మేరకు అందుబాటులో ఉన్నాయి, ఏ చికిత్స అందిస్తున్నారు అడిగి తెలుసుకున్నారు.


డచ్ సమాధులను సందర్శిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

**తొట్లకొండ, బావికొండ సందర్శన**

బీచ్‌రోడ్డులోని తొట్లకొండ, బావికొండలను కలెక్టర్ సందర్శించారు. కలెక్టర్ వెంట జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, అధికారులు ఉన్నారు.

## ఓటర్ల సర్వే 50 శాతం పూర్తి

భీమునిపట్నం: భీమిలి పరిధిలో ఇంటింటికి ఓటర్ల సర్వే కార్యక్రమం విస్తృతంగా జరుగుతోందని ఇన్‌చార్జి ఆర్డీవో, నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి హుస్సేన్ అన్నారు. ఇప్పటివరకు 50 శాతం సర్వే పూర్తయిందన్నారు. రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బూత్ లెవెల్ అధికారుల (బీఎల్వో)తో ఈ సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపుతో పాటు అవసరమైన మార్పులు, చేర్పులు చేపడుతున్నట్లు చెప్పారు. అలాగే, తక్కువ ఓటర్లు ఉన్న ప్రాంతాల్లో కొత్త పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేయకుండా దగ్గర బూత్‌లోని జాబితాలో వారిని కలుపుతామని, ఎక్కువమంది ఉండే ప్రాంతాల్లో కొత్త బూత్‌లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ ప్రక్రియలో అందరూ తమ సహకారాన్ని అందించాలని అవసరమైన సూచనలు, సలహాలను ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు భాస్కరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఆర్డీఓ హుస్సేన్

## సీఐల బాధ్యతల స్వీకరణ

పీఎం పాలెం: పీఎం పాలెం భీమిలి సీఐలు బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

పీఎం పాలెం లా అండ్ ఆర్డర్ సీఐగా జి.బాలకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖ రేంజ్ నుంచి ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా సీఐ విలేకరులతో మాట్లాడుతూ నగరంలోని పోలీస్ స్టేషన్లలో పెద్ద పోలీస్ స్టేషన్‌గా గుర్తింపు పొందిన ఈ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు ఉన్నతాధికారుల సూచనల మేరకు కృషి చేస్తానన్నారు. ఇక్కడ సీఐగా పనిచేసిన వై.రామకృష్ణ బదిలీపై విశాఖ రేంజ్‌కు వెళ్లిన సంగతి తెలిసిందే.


పీఎం పాలెం సీఐ బాలకృష్ణ


భీమిలి సీఐ సుధాకర్

**భీమిలి సీఐగా సుధాకర్**

భీమునిపట్నం: భీమిలి సీఐగా బొడ్డేపల్లి సుధాకర్ బుధవారం సాయంత్రం బాధ్యతలను స్వీకరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నుంచి ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన సీఐ డి.రమేష్‌ను వీఆర్‌లో ఉంచారు. సుధాకర్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానన్నారు. ఏ సమస్య వచ్చిన స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

## పల్లెల్లో ‘కృష్ణయ్య’ సందడి

**మూడు గ్రామాల్లో పల్లకీ ఉత్సవం**

తగరపువలస: భీమునిపట్నం మండలం లక్ష్మీపురం ఆనందాశ్రమం వద్ద ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుడి ప్రతిమను బుధవారం లక్ష్మీపురం, సింగన్నపేట, కృష్ణంరాజుపేట గ్రామాల్లో బుధవారం పల్లకీలో ఊరేగించారు. శ్రీకృష్ణుడి ప్రతిమకు భీమునిపట్నం వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, సింగన్నబంద సర్పంచ్ గాడు వెంకట నారాయణ, లక్ష్మీపురం సర్పంచ్ లచ్చుబోతు జగదీష్ పూజలు చేసి, పల్లకీ మోశారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక మజ్జివలస ఆనందాశ్రమం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు వి.గౌతమ్ వర్మ, అప్పలనాయుడు, వత్సవాయి రోజా రాణి, నారాయణ పాల్గొన్నారు.


లక్ష్మీపురంలో శ్రీ కృష్ణుడి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న వైస్ ఎంపీపీ బంగారునాయుడు

## స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ

మధురవాడ: స్వచ్ఛత – పరిశుభ్రతపై మారికవలస రాజీవ్ గృహకల్ప కాలనీలోని మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛ పక్వాడా కమ్యూనిటీ ఔట్ రీచ్ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. కాలనీలో నివాసాలను సందర్శిస్తూ విద్యార్థులు, ఉపాధ్యాయులు స్వచ్ఛత–పరిశుభ్రత ప్రాధాన్యత గురించి కాలనీవాసులకు వివరించారు. నీటి సంరక్షణ, వ్యర్థాల నిర్వహణ ఆవశ్యకత చాలా ముఖ్యమని చెప్పారు. పరిసరాల పరిశుభ్రత ద్వారా చాలా వ్యాధులకు దూరంగా ఉండవచ్చని ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్ సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని అనురాధ, విద్యార్థులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంపై మహిళలకు అవగాహన


ఆర్‌హెచ్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పాల్గొన్న మహిళలు

పీఎం పాలెం: చిన్నపాటి అవగాహన ఉంటే తక్కువ ఖర్చుతో పౌష్టికాహారం తయారు చేసుకోవడం ద్వారా మంచి ఫలితం పొందవచ్చునని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.సరిత అన్నారు. పీఎం పాలెంలోని ఆర్‌హెచ్ కాలనీ, లక్ష్మీవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని బాలింతలకు, గర్భిణులకు తక్కువ ఖర్చుతో లభించే పౌష్టికాహార పదార్థాలపై ఆమె అవగాహన కల్పించారు. రోడ్లపై లభించే చిరుతిళ్లు ఆరోగ్యానికి హాని చేస్తాయని, వాటికి దూరంగా ఉండాలని పేర్కొన్నారు. రాగులు, పప్పుధాన్యాలు, ఆకు కూరలతో ఇళ్ల వద్దనే రుచికరంగా తయారు చేసుకునే పౌష్టికాహార పదార్థాల గురించి వివరించారు. కార్యక్రమంలో భాగంగా బాలింతలకు, గర్భిణులకు, కిశోర బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతి నిర్మాణంలో యువత పాత్ర కీలకం


మాట్లాడుతున్న ఎంపీ పురందేశ్వరి

కొమ్మాది: జాతి నిర్మాణంలో, ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించడంలో యువత పాత్ర కీలకం అని పార్లమెంటు సభ్యురాలు డి.పురందేశ్వరి అన్నారు. భారత పరిశ్రమ సమాఖ్య (సీఐఐ) అనుబంధ యువజన విభాగం యంగ్ ఇండియన్స్ గీతంలో నిర్వహిస్తున్న యంగ్ ఇండియన్స్ పార్లమెంట్ ముగింపు సభలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజం పట్ల, దేశ భవిష్యత్తు పట్ల లోతైన అవగాహన గల యువత అవసరం దేశానికి ఉందన్నారు. యువత పార్లమెంటరీ వ్యవస్థను అర్థం చేసుకోవాలని, నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలని సూచించారు. యువతను చైతన్యవంతం చేయడంలో యంగ్ ఇండియన్స్ చేస్తున్న కృషిని రాజ్యసభ సభ్యుడు జి.వి.ఎల్.నర్సింహారావు అభినందించారు.

### ‘యంగ్ ఇండియన్ పార్లమెంట్’లో మెరిసిన యామిని

**ప్రథమ బహుమతి సాధించిన పద్మనాభం కేజీబీవీ విద్యార్థిని**

పద్మనాభం: రుషికొండలోని గీతం యూనివర్సిటీలో మంగళ, బుధవారాల్లో నిర్వహించిన యంగ్ ఇండియన్ పార్లమెంట్‌లో పద్మనాభం కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం విద్యార్థిని యామిని ప్రతిభ కనబరిచింది. జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలకు చెందిన 120 మంది విద్యార్థులతో పాటు మూడు కేజీబీవీలకు చెందిన పదిమంది విద్యార్థినులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులంతా పార్లమెంటేరియన్లుగా పాల్గొని.. జాతీయ, అంతర్జాతీయ సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పద్మనాభం కేజీబీవీలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఎం.యామిని ప్రథమ బహుమతి సాధించింది. ఆమెను డీఈవో ఎల్.చంద్రకళ, సమగ్ర శిక్షా అభియాన్ ఏపీసీ బి.శ్రీనివాసరావు, జీసీడీవో కలెషా బేగం అభినందించారు.


యామిని

## తరగతి గదుల్లోనూ కుక్కల బెడద

తగరపువలస: ఇటీవల ఎక్కడ చూసినా వీధికుక్కల బెడద ఎక్కువగా ఉంది. రోడ్లపై కాపు కాసి మరీ దారిన పోయేవారి పిక్కలు పట్టుకుంటున్నాయి. దీంతో పలువురు హడలిపోతున్నారు. ఈ వీధి కుక్కలు ఆస్పత్రులు, పాఠశాలలనూ విడిచి పెట్టడం లేదు. కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ బుధవారం చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించినప్పుడు అక్కడే తిష్ట వేసిన కుక్కను బయటకు పంపించడానికి ఉపాధ్యాయులు, సిబ్బంది నానా అవస్థలు పడ్డారు.


కలెక్టర్ ఉన్న తరగతి గదిలోకి ప్రవేశించిన కుక్కను బయటకు పంపుతున్న సిబ్బంది

## విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గరే సదానంద అనే యువకుడు బుధవారం నగదు ప్రోత్సాహకాలు అందించాడు. బాగా చదివే పేద విద్యార్థులకు నెలకు రూ.500 వంతున నలుగురు విద్యార్థులకు నాలుగు నెలలకు సంబంధించి రూ.2వేలు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు పాల్గొన్నారు.

టీచర్స్‌డే శుభాకాంక్షలు
SRI SATYA SARASWATHI HIGH SCHOOL
Nursery to 10th
Chippada, Bheemili. Ph : 97018 10956, 99664 22376

సాక్షి క్లాసిఫైడ్స్

**PASSPORT MISSING**
I, V.DANALAKSHMI Residing at D. No.9-503, Sanjeevanagar Colony, Visalakshinagar, Visakhapatnam - 530043, (AP). I Have lost my Passport bearing No. W5288428 while i was traveling from Hanumanthawaka to R.T.C. Complex by Bus on 18-08-2024. If any body found please Contact.
93474 63922

Real Estate

**R/E WANTED**
■ Wanted sites 200 to 400 Sqyds Developments Sites with in City limits, Visakhapatnam & Vizianagaram. Cont :92466 24248 [V- 823826]

Services

**BUSINESS OFFER**
■ ద్వారకాఎంటర్‌ప్రైజెస్‌పేపర్‌ప్లేట్స్ & LED మిషన్స్‌పై ప్రతి నెల అధిక ఆదాయం అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. 9310515624, 8800496710 [G-2157]
■ ఫింగో ఎంటర్‌ప్రైజెస్ అన్ని రకాల వ్యాపార ప్రాజెక్ట్‌లను అందిస్తుంది వ్యక్తిగత, వ్యవసాయ, విద్య DMA స్వాగతం, జీతం+కమీషన్, ✆ 9266809540. [T-278]

**GOLD LOANS**
■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 12484]

Wanted
■ Wanted Male and Female work for MNC company Qul:10th to degree, Sal: 15k to 25k. cont 9030612463 (work from home facility is available) [G-9026]
■ జొన్నాడ టోల్ ప్లాజా వద్ద పనిచేయుటకు మాజీ సైనికులు కావలెను. ఆసక్తి గలవారు సంప్రదించండి. మేనేజర్ : 86395 64077, 97666 77567 [V- 776868]
■ ఆయా కావలెను : స్కూలు నందు ఆయాగా పనిచేయుటకు 45 సం॥ లోపు గల ఆడమనిషి కావలెను. N.T.School, 80 ఫీట్ రోడ్, అక్కయ్యపాలెం, విశాఖ–16. సెల్ : 99590 94720 [V- 2684]
■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul: 10th- డిగ్రీ మీ అడ్రస్ వాట్సాప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 77024 73949 [G-9024]
■ ప్రముఖ ఎయిర్‌పోర్ట్‌లో పనిచేయటానికి కార్గో సూపర్‌వైజర్, కంప్యూటర్ ఆపరేటర్స్, సెక్యూరిటీ సూపర్‌వైజర్, క్యాబ్ డ్రైవర్స్ అర్జెంటుగా కావలెను. జీతం : 28000 నుంచి 34000 రూము + భోజనం ఫ్రీ. Ph: 9133671684 [HA-579]
■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు ఇంటి / వంట పనికి వర్కర్స్/నర్సులు కావలెను.ఫ్రీవసతి+భోజనం .జీతం 20K.ఫోన్: 8977639662, 8977639663 [H-796273]

**గమనిక**
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.
మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి
మురళీనగర్, మాధవధార : 90101 33346
NAD, కంచరపాలెం : 90108 10033
గోపాలపట్నం, పెందుర్తి : 70759 89701
సీతమ్మధార, ద్వారకానగర్ : 90100 55116
డాబాగార్డెన్స్, జగదాంబ, MVP కోలనీ, మద్దిలపాలెం : 90101 96663
గాజువాక : 97059 33394
విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం